# ఇది కథ కాదు

కె. రమణమ్మ

"రవీ! ఈ నెల పదవ తారీఖున నా దగ్గరే నీవు తప్పక రావాలి. నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను."—

తెల్ల కాగితం మీద ముత్యాల్లాంటి అక్షరాలు. రూపంలో, నవ్వులో కాదు. సుధ ప్రతి కదలికలో, మాటలో, వ్రాతలో కూడా అందంగా వుందనిపిస్తుంది.

"నీ కోసం ఎదురుచూస్తూ వుంటాను." సుధా! ఒక్క మాటలో నీ ప్రేమనంతా వెలిబుచ్చావు. నీ ప్రేమను పొందిన నేను చాలా అదృష్టవంతుడిని. నిజంగా నీవు ప్రేమ మూర్తివి సుధా!" ఏదో తన్మయత్వంలో తేలిపోతూ సుధ వ్రాసిన ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుని హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు రవి.

సుధ తన జీవిత మార్గదర్శిని, చీకటిలో క్రుంగిపోతున్న తనకు చేయూతనిచ్చి వెలుగులోనికి తీసికొచ్చి తన జీవితానికొక అర్థం చూపిన అమృతమూర్తి. పెదవాళ్ళు ఆలోచించి ఆమె కాపేరు పెట్టారేమో అనిపిస్తుంది ఆమెను చూస్తే. సుధను చూసి చాలా రోజులైంది. ఎలావుందో ఏమిటో. ఏమిటో ఈ మధ్య సుధ తలపుకొచ్చినప్పుడల్లా మనస్సులో ఏదో తెలియని విరహబాధ అది తాను భరించలేకపోతున్నాడు. తనే యిలా వున్నాడు పాపం సుధ తనను విడచి ఎలా వుండగలుగుతున్నదో! వెంటనే సుధను చూడాలన్న తపన, సెలవులేక తను వెళ్ళలేక ఇన్నాళ్ళబట్టి ఉత్తరాలతోనే మనస్సు తృప్తిపరచుకుంటున్నాడు. సుధకూడా తనను నిరుత్సాహపరచక ఎంతో అభిమానాన్ని కనబరుస్తూ ఉత్తరాలు వ్రాస్తూ వుంటుంది. ఎన్నాళ్ళనుంచో తన మనస్సులోని మాట సుధతో చెప్పాలనుకుంటున్నాడు. అది ఉత్తరాల ద్వారా కాకుండా సుధను ఒంటరిగా వున్నప్పుడే కలిసి చెపితే బాగుంటుందనుకున్నాడు. కాని సమయం కుదరక వూరుకున్నాడు. ఈ సారి సుధతో ఆ విషయం చెప్పనిదే తిరిగి రాకూడదని నిశ్చయించుకున్నాడు.

అందంగా నవ్వడం సుధ స్పెషల్ ఎట్రాక్షన్. సుధనవ్వితే అరవిందాలు విరిసినట్లుంటుంది. టూత్ పేస్టు ఎడ్వర్టైజ్‌మెంటు లాంటి ఆమె పలువరుస మిలమిల మెరిసిపోతూ ఆమె నవ్వుకు వింత అందాన్నిస్తుంది. ఆమె నవ్వు ఎంతటివారినైనా ఆకట్టుకుంటుందనే చెప్పొచ్చు. ఆమె నవ్వేకాదు. ఆమె సౌందర్యం కూడా తెల్లని పింగాణీ బొమ్మలా కాకుండా పసుపు పచ్చని ఛాయలో వెన్నముద్దలా మృదువుగా వుంటుంది ఆమె శరీరం. మనిషి స్లిక్ అంత పొడుగు కాదు. అలాగని మరీ పొట్టికాదు. ఆమె నాజూకు

దిద్దిన కనులు చేప పిల్లలా మెరిసే నేత్రం టాయి ముక్కు చూడముచ్చటగా వుంటుంది ఆమెను ఒక్కసారి చూస్తే చాలు మళ్ళీ మళ్ళీ చూడాలని పిస్తుంది. ఆమె అందరి చేత ఆకర్షింప బడటానికి యివే కారణాలు కావు ఎన్నో కారణాలున్నాయి. మొదటిది ముక్కు ముఖం తెలియని వారితో నైనా ఎంతో అభిమానంగా కలిసి కట్టుగా మాట్లాడటం రెండవది ఎదుటివారి కష్టాలను సాను భూతితో అర్థం చేసుకుని తనకు తోచిన సహాయం చేయటం. ఇంకా యిలా ఎన్నో.. చాలా మంది ఆమె అందాన్ని ఆరాధించే వారు ఆమె అందాన్ని ఆరాధించటమే కాదు ఆమె జీవిత భాగస్వామి కావాలని అనుకునే వారిలో రవి ప్రథముడు.

ఎంతో చిత్రమైన పరిస్థితిలో సుధ తనకు పరిచయమైంది.

* *

ఆరోజు సాయంత్రం ఆరున్నర కావస్తున్నది. బీచిలో సన్నగా చీకట్లు కమ్ము తున్నాయి. తన కెందుకో ఆ రోజు జీవితం మీద విరక్తి కలిగి బ్రతకాలన్న ఆశ నశించింది.

"ఏయ్ మిస్టర్ ! ఆగు...పిరికివాడిలా ఏమిటా పని. ముందు నాతో రా" సుధ, వాళ్ళ నాన్నగారు కలిసి తనను పట్టుకుని తను రానంటున్నా వినకుండా నీళ్ళలోనుంచి బల వంతంగా బయటకు లాక్కొచ్చి ఒకచోట తనను కూర్చోపెట్టి వాళ్ళిద్దరు చెరొక ప్రక్క కూర్చుని తనవైపు జాలిగా చూస్తూ వుండి పోయేరు.

"మీరేమీ అనుకోనంటేఒక్కమాట..."

"అనుకోను అడగండి"

"అదే మీరు...ఎందుకు చావాలనుకుంటు న్నారు ?" సుధ ప్రశ్నించింది.

"జీవితంమీద విరక్తి కలిగి" .... కటు వుగా వచ్చింది సమాధానం. రవి మాటల్లో జీవంలేదు. సంఘంమీద కసి పెరిగిపోయింది.

"అంటే...పరిస్థితులా ?" ....

"అవును. పరిస్థితులే నన్నీ స్థితికి తెచ్చేయి. కాళ్ళరిగి పోయేలా వుద్యోగం కోసం తిరిగేను కనీసం చిన్న వుద్యోగం కూడా దొరకలేదు. ఇంట్లో చావు బ్రతుకుల మధ్య వూగిసలాడుతున్న తల్లి. సరియైన మందైనా యిప్పించలేక పోతున్నాను. కటిక దరిద్రాన్నను భవిస్తున్నాను. యింక బ్రతికీ ప్రయోజనం లేదని" ... దుఃఖంతో పూడుకు పోయింది అతని కంఠం.

"చచ్చి ఏమిసాధిస్తారు మీకు కావల సింది వుద్యోగమేగా. వారం రోజుల్లో మీకు వుద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తాను పాపం కష్టాలో వున్నారు అంతవరకు ఈ డబ్బు వుంచుకోండి అంటూ తనెంత చెప్పినా విన కుండా పర్సులోంచి డబ్బుతీసి చేతిలో పెట్టింది. ఆ తర్వాత వాళ్ళ యింటికి రమ్మని అడ్రసిచ్చి వెళ్ళిపోయింది. ఈవిధంగా సుధ తనకు ఎన్నో విధాల సహాయంచేసి, ధైర్యంచెప్పి మోడుబారి పోతున్న జీవి తాన్ని చిగురింప చేసింది. ఆ పరిచయం పెరిగి ఎందుకో సుధ తన మనస్సుకు చాలా దగ్గరగా వచ్చేసింది

సుధకు తనంటే వెర్రి ప్రేమ. పాపం పిచ్చి పిల్ల తన కోసం ఎదురు చూస్తూ వుంటుంది. తప్పక వెళ్ళాలి. సరిగ్గా అను కున్నట్టుగా తొమ్మిదవ తారీఖు రాత్రికే సుధ యింటికి చేరుకున్నాడు రవి.

సుధ బర్త్ డే పార్టీ ఎంతో గ్రాండుగా జరిగింది. ఆ మర్నాడు సాయంత్రం ఇద్దరూ బీచికి వెళ్ళారు.

"సుధా ! మనం ఎన్నాళ్ళిలా ఒంటరిగా బ్రతుకుతాం. నిన్ను విడిచి నేనక్క డ ఒంటరిగా వుండలేక పోతున్నాను. సుధా ! నీ నవ్వు, నీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేసేస్తున్నాయి. ఇక నిన్ను విడని క్షణం

కూడా.... — ఆవేశంలో సుధ చేతిని గట్టిగా పట్టేసుకుని ఆమె భుజంమీద వాలిపోయాడు రవి.

సుధ వెంటనే లేచి నిలబడి రవీ! ఈ విషయాలు తర్వాత మాట్లాడుకుందాం కానీ.... ముందు మనం ఏదైనా పిక్చర్ కెళదాం పద అంటూ రెండడుగులు ముందుకు వేసింది.

రవి చేసేది లేక మౌనంగా ఆమె ననుసరించాడు.

• • •

పూరీ లవర్!

రవీ నీవు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో నాకు తెలుసు. అది నిస్వార్థమైన ప్రేమ. నా మనస్సులోని మాట నీతో ఎన్నాళ్ళ నుంచో చెప్పాలను కున్నాను. కాని నీ వెక్కడ బాధ పడతావోనని, పిచ్చి వాడివై పోతావేమోనని చెప్పలేక పూరు కున్నాను. కాని రోజు రోజుకు నీవు నా మీద ఆశలు పెంచుకుంటున్నావు కనుక యింక చెప్పకపోతే పరిస్థితు లెంత విషమిస్తాయో నని చెప్పలేక చెపుతున్నాను. నీ మీద నా కెలాంటి అభిప్రాయంలేదు ఈ రోజుల్లో ఆడ, మగ అన్ని రంగాల్లో సమాన హక్కులు కలిగి వున్నారు. ఇద్దరికీ సమాన ఆధిక్యత వుంది. ఆడది మగవాడితో సమానంగా ఇన్ని హక్కులు కలిగివుండి కూడా మగవాడికి బానిసగా బ్రతకడం నాకిష్టం లేదు. అందుకే వివాహం చేనే నా కసహ్యం. దయ చేసి నా మీద ఎలాంటి ఆశలు పెటుకోకు.

లీడ్ బెటర్ లైఫ్!!!

ఇట్లు.
నీ శ్రేయోభిలాషి
సుధ.

వ్రాసిన వుత్తరాన్ని మరొకసారి చదువుకుని పోస్టు చేసింది సుధ.

•

సుధ వ్రాసిన వుత్తరాన్ని చదువుదామని ఆసక్తిగా టేబిల్ దగ్గర కెళ్ళిన రవి, అక్కడే పేపరు ఫ్రంటు పేజీలో వున్న పెద్ద పెద్ద అక్షరాలను చూశాడు.

"మహిళామండలి సభ్యురాలు కుమారి సుధ రౌడీల చేతులలో పడి....". ఇక రవి చదవలేక కొయ్యబారిపోయాడు.

★

## బ్రతుకు భారం

బ్రతుకే భారమైపోయింది!
బజారు కెళ్ళాలంటే భయమేస్తుంది!
ఆకాశవాణేమో
ఆరుపైసలు తగ్గిందని చెప్తుంది!
అంగడి కెళ్ళి అడిగితే
అరపైసా తగ్గలేదంటాడు!
మూడువందల జీతం
మూడో తేదీకే మిగలకుంటే!
ముందుచూపు కావాలంటారు!
ముదుపు కట్టమంటారు!
మొగుడూ పెళ్ళామే బ్రతుకలేకుంటే
ముచ్చటగా ముగ్గురు పిల్లల్ని
కనమంటారు.
మారాజులకేం తెలుసు
మల మల మాడే
మామూలోళ్ళ బ్రతుకులు!

—గూడూరి రఘురామమూర్తి